కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని భాగిర్తిపల్లి గ్రామంలో గురువారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే భిక్కనూర్ పట్టణానికి చెందిన సంఘం సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి షబ్బీర్ అలీ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మద్ది చంద్రకాంత్ రెడ్డి, భిక్నూర్ మండల అధ్యక్షుడు భీమ్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్, పట్టణ అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు సందీప్, జిల్లా నాయకులు లింబద్రి, సిద్ధ గౌడ్, రవి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న భవిత పాఠశాలలో జరుగుతున్న యాక్టివిటీస్ గురించి అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తల్లిదండ్రులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు అందుతున్నాయని తెలుసుకొని, ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఐఆర్పీ మహేందర్ ఆక్టివిటీస్ చేస్తుండగా అబ్జర్వేషన్ చేస్తూ పిల్లలో నైపుణ్యాన్ని చూశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనాథ్, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ సిద్ధరాములు, తల్లిదండ్రులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సాగు ముందుకు సాగట్లే..

- జిల్లాలో తీవ్ర వర్షాభావ స్థితి
- విత్తనాలు నాటిన రైతుల్లో ఆందోళన
- 57 వేల ఎకరాల్లోనే వరి
- సోయాదీ అదే పరిస్థితి

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



ఫైల్

నిజామాబాద్ జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు సాగుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. జులై మాసంలో వారం రోజులు గడిచిన వాన జడ కనబడటం లేదు. అన్ని మండలాల్లో తీవ్ర లోటు వర్షపాతం నమోదయ్యింది. దీంతో జిల్లాలో సాగు ముందుకు సాగడం లేదు. సాధారణంగా జులై మాసానికి ఖరీఫ్ సీజన్‌లో ఒక్క వరి పంటనే రెండు లక్షల ఎకరాల వరకు సాగయ్యేది. కానీ ఈ యేడాది అన్ని పంటలు కలిపినా సాగు లక్ష ఎకరాలు దాట లేదు. ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు 4,18,079 ఎకరాల్లో అవుతుందని వ్యవసాయ శాఖ అంచనాలు రూపొందించిన విషయం తెలిసిందే. ఆరుతడి పంటల సాగు పూర్తిగా అటకెక్కింది. కొద్దిమంది మంది రైతులు మాత్రమే బోరుబావుల కింద మొక్క, సోయా సాగు చేశారు. మెజార్టీ రైతులు ఇంకా ఆకాశంకేసి వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు.

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 5,13,356 ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనాలు వేసింది. ఇందులో సోయా 58,715, మొక్కజొన్న 32,185 ఎకరాల్లో సాగయ్యే అవకాశమున్నట్టు పేర్కొన్నారు. సాధారణంగా జులై మాసానికి సోయా, మొక్కజొన్న సాగు పూర్తికావాలి. జూన్ రెండోవారానికి రైతులు విత్తనాలు నాటడం పూర్తి చేసేవారు. కానీ జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులతో ప్రస్తుతం మొక్కజొన్న కేవలం 24 వేల ఎకరాల్లో మాత్రమే సాగయ్యింది. ఇక సోయాబీన్ కేవలం 32 వేల ఎకరాల్లో సాగు చేశారు. సోయా ఇంకా 24 వేల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉంది. మొక్కజొన్నదీ అదే పరిస్థితి. వరి పంట విషయానికొస్తే 4,18,079 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా.. ఇప్పటి వరకు కేవలం 57 వేల ఎకరాల్లో మాత్రమే పంట సాగయ్యింది. నిజామాబాద్ జిల్లాలో వానాకాలం సీజన్‌లో కాలువల ద్వారా 87,433 ఎకరాల్లో పంటలు సాగవుతాయి. వ్యవసాయ శాఖ నుంచి ఖరీఫ్ సీజన్‌కు పూర్తిగా సన్నద్ధమైనప్పటికీ.. కాలం కలిసి రాకపోవడంతో రైతులకు ఇబ్బందులెదురవుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో సరిపడా విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచినట్టు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

బాబాగౌడ్ నుంచి డబ్బులు రికవరీ చేయాలి

- రూ.37 లక్షలు స్వాహా చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు
- రెండు గంటల పాటు రాస్తారోకో

నవతెలంగాణ-తాడ్వాయి



రాస్తారోకో చేస్తున్న మహిళలు

వీఏఓ బాబాగౌడ్ నుంచి డబ్బులు రికవరీ చేయాలని కోరుతూ మహిళలు పెద్ద సంఖ్యలో రోడ్డుపై బైఠాయించారు. పెద్దఎత్తున రాస్తారోకో నిర్వహించారు. తాడ్వాయి మండలం నందివాడ గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఎర్రపహాడ్‌లోని ఎల్లారెడ్డి, కామారెడ్డి రోడ్డుపై రెండు గంటల పాటు బైఠాయించి గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. తాము ఏ అధికారి వద్దకు వెళ్లినా పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. బాబాగౌడ్ నుంచి డబ్బులు రికవరీ చేయాలని కోరుతూ ఇటీవల కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను కలిశామని, అయినా కలెక్టర్ ఇప్పటివరకు స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కొక్కరి నుంచి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేసి బాబాగౌడ్ తన ఖాతాలో జమ చేసుకున్నాడని తెలిపారు. తాము నెల రోజుల నుంచి అధికారుల చుట్టూ తిరిగిన ఒక్క అధికారి పట్టించుకోవడం లేదని నిరసన వ్యక్తం చేశారు. బ్యాంకు అధికారుల ప్రమేయం లేకుండా డబ్బులు బాబా గౌడ్ బంధువుల ఖాతాల్లోకి ఎలా వెళ్తాయని ప్రశ్నించారు. బ్యాంకు అధికారులు బాబాగౌడ్‌కు పూర్తిగా సహకరించారని ఆరోపించారు. బ్యాంకు అధికారుల అండదండలు లేకుంటే బాబాగౌడ్ తన తల్లి, భార్య, చిన్నమ్మల పేర్లపై రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఎలా ట్రాన్స్‌ఫర్ అవుతాయని బ్యాంకు అధికారిని నిలదీశారు. గతంలో ఇక్కడ మేనేజర్‌గా విధులు నిర్వహించిన బ్యాంకు మేనేజర్‌ను రప్పించాలని డిమాండ్ చేశారు. అప్పటి బ్యాంకు మేనేజర్‌తో బాబాగౌడుకు మంచి సంబంధాలు ఉండడంతోనే బ్యాంకు నుంచి నేరుగా బాబా గౌడ్ బంధువుల ఖాతాలోకి డబ్బులు ట్రాన్స్‌ఫర్ అయ్యాయని తెలిపారు. అక్క డికి తాడ్వాయి ఏఎస్ఐ సంజీవులు చేరుకొని బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడి రాస్తారోకో విరిమింపజేశారు.

నందివాడ మహిళా సంఘాలలో స్వాహా ఆయన నిధుల అంశంపై గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన బ్యాంకు మేనేజర్‌ను ఇక్కడికి రప్పించడానికి పై అధికారులకు నివేదిక పంపుతానని మేనేజర్ కరీముల్లా తెలిపారు. మేనేజర్‌ను రప్పించి బాబా గౌడ్ బంధువుల ఖాతాలోకి డబ్బులు ఎలా ట్రాన్ఫర్ అయ్యాయో తెలుసుకుంటామని మేనేజర్ తెలిపారు. ఈ సందర్భంగా మేనేజర్ కరీముల్లా మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యుల తీర్మానం ఉంటేనే సదరు సభ్యుల అకౌంట్లోకి డబ్బులు ట్రాన్స్‌ఫర్ అవుతాయని తెలిపారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-రామారెడ్డి

అప్పుల బాధతో మహిళా ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామారెడ్డికి చెందిన మాసన్నగారి కలవ్వ (48) ఇద్దరి కుమారుల పెండ్లి ఒకే సంవత్సరం నిర్వహించడం, భర్త అనారోగ్యంతో ఆసుపత్రి ఖర్చులు, డ్వాక్రా గ్రూపులో లోన్ బాకీలతో ఇబ్బంది పడుతూ, ఇంట్లో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పెద్ద కుమారుడు పెద్ద లింబాద్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మరణించిన కార్యకర్తల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-బిచ్కుంద

మండలంలోని షట్లూర్ సీతారాంపల్లి గ్రామాలలో ఇటీవల మరణించిన వారి కార్యకర్తల కుటుంబాలను జుక్కల్ శాసనసభ్యులు, అసెంబ్లీ ప్యానల్ స్పీకర్ హనుమత్ షిండే గురువారం పరామర్శించారు. అనారోగ్యంతో మరణించిన షట్లూర్ గ్రామానికి చెందిన హనుమంతరావు, బిచ్కుంద మార్కెట్ కమిటీ డైరెక్టర్ విట్టల్ రెడ్డి కుమారుడు ఇటీవల మరణించారు. కర్రోళ్ల పోషబోయి గారి కుటుంబాన్ని పరామర్శించి మీ కుటుంబాలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే భరోసా కల్పించారు. కర్రోళ్ల పోషబోయి కుటుంబానికి 50వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎంపీపీ అశోక్ పటేల్, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగనాథ్ పటేల్, శ్రీహరి రాజు, బసవరాజ్ పటేల్, రాజుపటేల్ సర్పంచ్ లు పండరి, గంగారెడ్డి ఉన్నారు.

పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉండాలి

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పరిసర ప్రాంతాలు పిచ్చి మొక్కలు, గడ్డి లేకుండా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ నాగనాథ్ అన్నారు. గురువారం మండల విద్యావనరుల కేంద్రంలో బోధన్ ఉమ్మడి మండలాల ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో పిచ్చి గడ్డి ఉన్న యెడల తొలగించుకోవడానికి గ్రామపంచాయతీ కార్యదర్శి లిఖితపూర్వకంగా అందించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు 12 అంశాలతో కూడిన సమగ్ర వివరాలను మన ఊరు మనబడి యాప్‌లో ఏ విధంగా నమోదు చేయాలో వివరించారు. వాటి వివరాలు మండల విద్యా కేంద్రంలో మార్పించాలని అన్నారు. వర్షాలు పడుతున్నందున పాఠశాల పరిసరాలలో పిచ్చి మొక్కలు గడ్డి పెరిగి విష జంతువులు సంచరించుతాయని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున సంబంధిత గ్రామంలోని గ్రామ కార్యదర్శులకు రాతపూర్వకంగా తెలియజేసి పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు. సమావేశంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను తొలగించేందుకు అధికారుల చర్యలు

- ఐదు రోజుల గడువును కోరిన హెూటల్ యజమాని

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో సందీప్ అనే హెూటల్ యజమాని అక్రమంగా రోడ్డు బౌండరీలో హెూటల్ వేశారని, అజార్ అనే రైతు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో, రోడ్డు భవనాల శాఖ అధికారులతో పాటు, పంచాయతీ అధికారులు సంఘటన స్థలానికి విచ్చేశారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు అక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగించడానికి పోలీస్ బందోబస్తుతో వచ్చిన అధికారులు స్థానిక గ్రామపంచాయతీలో చర్చించారు. సర్పంచ్ బైండ్ల రాజు గ్రామస్తులతో దీని విషయంలో చర్చలు జరిపినప్పటికీ, రైతు వినకపోవడంతో అక్రమ కట్టడాలను తొలగించడానికి సంసిద్ధులయ్యారు. హెూటల్ యజమాని ఐదు రోజుల గడువు కావాలని, స్థానిక రైతుతో సమస్యను పరిష్కరించుకోవడానికి సమయం ఇవ్వాలని కోరడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఎంపీఓ గౌస్ ఉద్దీన్ అందుకు సమ్మతించారు. కార్యక్రమంలో రోడ్డు భవనాల శాఖ డీఈ, స్థానిక ఎస్సై పి.సాయన్న, గ్రామ కార్యదర్శి రాజు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

గ్రామాల పారిశుధ్యంపై లక్ష్యం పెట్టండి

నవతెలంగాణ-జుక్కల్



గ్రామాల పారిశుధ్యంపై లక్ష్యం పెట్టాలని ఎంపీవో యాదగిరి అన్నారు. గురువారం మండలంలోని 30 గ్రామ పంచాయతీలలో పారిశుధ్యంపై, ఇతర అంశాలపైన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్, ఎంపీవో యాదగిరి, జేపీఎస్‌లు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించిన సీఆర్‌పీ మహమ్మద్

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని గోకుల్ తండాకు చెందిన అరవింద్, బడికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉండడానికి గమనించిన సీఆర్పీ మహమ్మద్, అరవిందుకు, విద్యార్థి తల్లికి గురువారం చదువు విలువ, భవిష్యత్తుపై కౌన్సెలింగ్ ఇచ్చి పోసానిపెట్ జిల్లా పరిషత్ పాఠశాలలో, ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి సమక్షంలో 9వ తరగతిలో చేర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజలింగం, శ్రీనివాస్, నాగభూషణం, గంగమణి తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు ఇచ్చిన హామీ ఏమైంది..?

- సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహన్

నవతెలంగాణ-విలేకరుల బృందం



నిరసనలో పాల్గొన్న పలువురు

డిచ్‌పల్లి : గ్రామ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీ ఏమైందని, రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి కృషి చేసి సహకరించి, సిబ్బంది న్యాయమైన డిమాండ్‌లను నేరవేర్చే విధంగా ముఖ్య మంత్రి చొరవ చూపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహన్ డిమాండ్ చేశారు. గురువారం న్యాయమైన డిమాండ్‌ల సాధనకై గ్రామ పంచాయతీ సిబ్బంది నిరవధిక సమ్మె శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నూర్జహన్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ట్రేజరీల ద్వారా వేతనాలు చెల్లించాలని అన్నారు. ఆ లోపు జీవో నెం.60 ప్రకారం స్వీపర్లకు 15,500 ఆపరేటర్లు, ఎలక్ట్రిషియన్లు, డ్రైవర్లు, కారోబార్, బిల్ కలెక్టర్లకు రూ.19,500లు నిర్ణయించాలన్నారు. 31 కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయక కార్యదర్శులుగా నియమించాలని, జీవో నెం.310 సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, పాత కేటగిరీలన్నింటినీ యధావిధిగా కొనసాగించే విధంగా చూడాలని కోరారు. విధి నిర్వహణలో ప్రమాదం జరిగి మతి చెందిన సిబ్బంది కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారాన్ని ప్రభుత్వమే ఇవ్వాలని, పోస్టాఫీస్ బీమా పథకం ద్వారా చెల్లించాలని, ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సహజ మరణానికి ఇన్సూరెన్స్ పథకాన్ని రూ.5 లక్షలకు పెంచాలన్నారు. కార్మికులపై వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని పై డిమాండ్ల పరిష్కారం కోసం జేఏసీ ప్రతినిధులతో వెంటనే జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్క రించి తోడ్పాటు అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, జిల్లా సహాయ కార్య దర్శి నన్నేసాబ్, ఏరియా నాయకులు, గ్రామ పంచాయతీ జిల్లా అధ్యక్షులు రాజేష్, మండల అధ్యక్షులు మ్యాదరి గంగారాంతోపాటు పాల్గొన్నారు.

వర్ని : తెలంగాణ గ్రామ పంచాయతీ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపులో భాగంగా వర్ని మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెను సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మల్యాల గోవర్ధన్ ప్రారంభించారు.

గాంధారి : మండలంలోని గ్రామపంచాయతీ ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. గ్రామపంచాయతీ వర్కర్లకు పర్మినెంట్ ఉద్యోగాలను గుర్తించాలని, పీఆర్‌సీ నిర్ణయించి రూ.19000 కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి ప్రకాష్ నాయక్, కమ్మర్ సాయిలు, గ్రామపంచాయతీ సిబ్బంది సాయిలు, నర్సింలు, భూమయ్య, భూపతి, రవి, దాకాయ్య, గంగామణి, సాయవ్వ, ఆశావ్వ పాల్గొన్నారు.

రెంజల్ : గ్రామపంచాయతీ పరిధిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎంపీఓ గౌసద్దీన్‌లకు వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండలంలోని పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపానగల ధర్నా చౌక్ వద్ద తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘం జేఏసీ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికులు సిబ్బంది నిరవధిక సమ్మె కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో నిజామాబాద్ జేఏసీ కన్వీనర్ జంగం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆగదు..

భిక్కనూర్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆగదని గ్రామపంచాయతీ కార్మికులు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం భిక్కనూర్ పట్టణంలో గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె ప్రారంభించారు. పంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని, కారోబార్లకు స్పెషల్ స్టేటస్ ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మె కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్మికులు పాల్గొన్నారు.

రైతుల కల నెరవేరిన రోజు

- ఎస్సారెస్పీ వరద కాలువకు చేరుకున్న కాళేశ్వరం జలాలు
- కాళేశ్వరం జలాలకు పూజలు చేసిన మంత్రి వేముల
- భారీగా తరలి వచ్చిన రైతులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



పూజలు చేస్తున్న మంత్రి

కాళేశ్వరం గోదావరి జలాలు ఎస్సారెస్పీ వరద కాలువ ద్వారా జిల్లాలోకి ప్రవేశించడంతో రైతుల కల నెరవేరిన రోజిదని రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంతి రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఉప్లూర్ రోడ్డులోని ఎస్సారెస్పీ వరద కాలువ వద్ద కమ్మర్‌పల్లి, నాగపూర్, ఉప్లూర్, ఏర్గట్ల గ్రామాల బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, రైతుల సమక్షంలో కాళేశ్వరం జలాలకు మంత్రి ప్రశాంత్‌రెడ్డి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రైతులతో పాటు దేశ రైతాంగానికి కేసీఆరే శ్రీరామ రక్ష అన్నారు. గోదారమ్మ ఎదురు ఎక్కుతుందని తాను కలలో కూడా ఊహించలేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కి రైతుల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. తన హయంలో ఎస్సారెస్పీ పునర్జీవం పనులు పూర్తవడం అదష్టంగా భావిస్తున్నానన్నారు. 2001లో ఇచ్చిన మాట నిలబెట్టుకొని రైతుల గుండెల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ చిరస్మరణీయ స్థానం సంపాదించారన్నారు. 3 వందల కిలోమీటర్ల రివర్స్ పంపింగ్ ద్వారా నీటిని తరలించడం చాలా గొప్ప విషయమన్నారు. ఇక వర్షాలతో సంబంధం లేకుండా సంవత్సరం పొడువునా రైతులకు సాగు నీరు అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి, సర్పంచ్ గడ్డం స్వామి, ఎంపీటీసీ సభ్యుడు సుధాకర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్, బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి

నవతెలంగాణ-బోధన్



నివాళులర్పిస్తున్న పలువురు

భారత మాజీ ఉప ప్రధాని, ప్రముఖ సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్ రామ్ 37 వర్ధంతిని గురువారం బోధన్ ఉమ్మడి మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాలూర మండల కేంద్రంలోని బాబు జగ్జీవన్ విగ్రహానికి దళిత సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అల్లే జనార్ధన్, బిఆర్ఎస్ ముఖ్య నాయకులు బుద్దె రాజేశ్వర్, గ్రామ పెద్దలు సురేష్ పటేల్ ,మాదిగ మేధావుల ఫోరం జిల్లా సహాయ కార్యదర్శి లింబూరి లక్ష్మణ్, బీఎస్పీ బోధన్ నియోజకవర్గ అధ్యక్షులు సింగడి పాండు,మోచి సంఘం నాయకులు దత్తు, అంబేద్కర్ సంఘం నాయకులు రావుల లక్ష్మణ్, దండోరా సంఘం నాయకులు లాలయ్య, లక్ష్మయ్య, చంటి, సుభాష్, సాయిలు పాల్గొన్నారు.

బోధన్ పట్టణంలో..

బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్ చౌరస్తాలో గల బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి టీఎమ్ఆర్పీఎస్, ఎంఆర్పిఎస్ నాయకులు బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ముదిరాజ్ సంఘ భవనానికి భూమిపూజ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని కళ్యాణి బెస్ ముదిరాజ్ సంఘం భవనానికి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ గురువారం భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ భవనానికి రూ.10లక్షల నిధులు మంజూరు చేయడం జరిగిందని స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామని పట్టణంలోని ప్రతి సంఘానికి ఎమ్మెల్యే నిధులు ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ జీవన్, వార్డ్ కౌన్సిలర్ నీలకంఠం, పెద్దరెడ్డి, ఎంపీటీసీ సంతోష్, ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి

- ఏడీఏ అపర్ణ

నవతెలంగాణ-భిక్కనూర్

వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించి రైతులు పంటలు వేసుకోవాలని వ్యవసాయ పంటలు ఏమైనా సమస్యలు ఏర్పడితే ఏఈవోల సూచనలు మేరకు మందులను వాడాలని సూచించారు. అలాగే విత్తనాల షాపులలో విత్తనాల శాంపిల్ సేకరించి టెస్టింగ్ కొరకు ల్యాబ్‌కు పంపించడం జరుగుతుందని, నకిలీ విత్తనాలు అని తెలిస్తే కంపెనీపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ పరిశీలనలో ఏవో రాధా, ఏఈఓ రవి తదితరులున్నారు.

రైతుబంధు రూ.197 కోట్లు జమ

- 2.43 లక్షల మంది రైతులకు లబ్ధి

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రైతుబంధు కింద రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థికసాయం ఇప్పటి వరకు జిల్లాలో 2.43 లక్షల మందికి అందింది. మొత్తం రూ.197 కోట్లు నిధులు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. జూన్ 28వ తేదీ నుంచి ఖరీఫ్‌కు సంబంధించి ఆర్థికసాయం అందజేస్తున్న విషయం తెలిసిందే. ప్రతియేడాది ఎకరాకు రెండు సీజన్‌లకు సంబంధించి రూ.10 వేల అందజేస్తుంది. ఈ యేడాది ముందుగా చిన్న, సన్నకారు రైతులకు రైతుబంధు నిధులు ఖాతాలో జమ అయ్యాయి. ప్రస్తుతం 4-4.5 ఎకరాలు ఉన్న రైతులకు నగదు అందుతోంది. ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 2,86,226 మంది రైతులను అర్హులుగా గుర్తించారు. వీరందరికీ రూ.278 కోట్లా41 లక్షలా 23 వేలా 806 నగదు అందాలి. గురువారం వరకు 2,43,363 మంది రైతులకు రూ.197 కోట్లా 19 లక్షలా 71 వేలా 495 నగదు ఖాతాల్లో పడింది.

పోడు పట్టాలివ్వాలి

- పోడు పట్టాల కోసం పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చిన గిరిజనులు



పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చిన గిరిజనులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని జగదాంబ తండా, రాంపల్లి తండా గిరిజనులు పోడు పట్టాలివ్వాలని కోరుతూ స్థానిక పోలీస్ స్టేషన్‌కు గురువారం తరలివచ్చారు. రామాయపల్లి శివారులోని సర్వే నంబర్ 830లో జగదాంబ తండా, అన్నారెడ్డి పల్లి తండాకు చెందిన తాము గత కొన్ని సంవత్సరాలుగా పోడు భూములు సాగు చేసుకుంటున్నామన్నారు. పోడు పట్టాల కొరకు రెవిన్యూ అటవీశాఖ అధికారులు సంయుక్త సర్వే చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాంపల్లి బీట్ ఆఫీసర్ అర్హులైన గిరిజనులకు పట్టాలు ఇప్పిస్తానని భరోసా ఇచ్చారని ప్రస్తుతం ప్రభుత్వం పోడు పట్టాల ఇస్తున్నప్పటికినీ మాకు మాత్రం పోడు పట్టాలు రాలేదన్నారు. పట్టాలివ్వాలని అటవీ సంరక్షణ కమిటీ చైర్మన్ సరిచేంద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం బీట్ ఆఫీసర్‌ను వివరణ కోరగా.. గిరిజనులకు ఎలాంటి హామీ ఇవ్వలేదని ఆయన అన్నారు. గిరిజనులకు అటవీ శాఖ అధికారులు అన్యాక్రాంతం చేయవద్దని సూచించినా.. రాంపల్లి తండా, జగదంబతండా, అన్నారెడ్డిపల్లి తండాకు చెందిన గిరిజనులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మన ఊరు మనబడి పనులు పరిశీలించిన డీఈవో

నవతెలంగాణ-బోధన్

మండలంలోని ఖండ్గాం గ్రామంలో మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పనులను జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ గురువారం పరిశీలించారు. పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణంలో ఇబ్బందులు తలెత్తడంతో ఆయన పాఠశాలను సందర్శించి ఇబ్బందులు పరిశీలించారు. ప్రహరీ గోడ నిర్మాణంలో ఎలాంటి సమస్యలు లేవని పనులు నాణ్యత చేపట్టాలని డీఈవో కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం కల్దుర్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఆయన వెంట మండల విద్యాధికారి నాగనాథ్, కాంప్లెక్స్ హెచ్ఎం, పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు ఇల్తెపు శంకర్ ఉన్నారు.

వాగ్దేవి విద్యానికేతన్‌కు నోటీసు

- నవతెలంగాణ వార్తకు స్పందన

నవతెలంగాణ-బోధన్

ప్రయివేటు పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అధిక ధరలకు పుస్తకాలను విక్రయిస్తుండడంతో దానిపై నవతెలంగాణ దినపత్రికలో జూలై 2 ఆదివారం 'ప్రయివేటు పాఠశాల-ఫక్తు బిజినెస్' అంటూ వార్త కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన బోధన్ ఎంఈఓ నాగనాథ్ సాలూరా మండల కేంద్రంలోని వాగ్దేవి విద్యానికేతన్ పాఠశాలకు నోటీసులు పంపినట్టు తెలిపారు. ప్రయివేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించిన, పాఠశాలలో వస్తువులు విక్రయించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎంఈఓ హెచ్చరించారు.

అధిక ఫీజులు తీసుకుంటున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-గాంధారి

అధిక ఫీజులు తీసుకుంటున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు ఎంఈవోకు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ప్రేమ్ దాస్ నాయక్, పర్శురామ్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవి సింగ్ నాయక్ పాల్గొన్నారు.

న్యాక్ కేంద్రం తనిఖీ



నవతెలంగాణ-భీంగల్

భీంగల్ పట్టణకేంద్రంలో కొనసాగుతున్న న్యాక్ కేంద్రాన్ని డైరెక్టర్ సత్యపాల్ రెడ్డి గురువారం తనీఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఎంతమంది శిక్షణ తీసుకుంటున్నారో ఇంచార్జీ దిలీప్‌ను అడిగి తెలుసుకున్నారు. టైలరింగ్‌లో 72 మంది, ఎలక్ట్రికల్ విభాగంలో 20 శిక్షణ పొదుతున్నట్లు ఇంచార్జీ తెలిపారు. సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. బాల్కొండ, కమ్మర్‌పల్లిలో టైలరింగ్ సెంటర్ వెంటనే ఏర్పాటు చేయాలని అసిస్టెంట్ డైరెక్టర్ ప్రభాకర్‌కు సూచించారు. ఈయన వెంట ట్రైనర్ ఓంకార్, రుచిత తదితరులున్నారు.

మధ్యాహ్న భోజన పెండింగ్ బిల్లులు విడుదల

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనం కు సంబంధించి 2022 - 2023 సంవత్సరం పెండింగ్లో ఉన్నా బిల్లుల నిధులు విడుదల చేసిందని డిఇఓ ఎన్వి దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటవ తరగతి నుండి 8వ తరగతి వరకు వంట ఖర్చు రూ. 98,62,000 లు, 9వ, 10వ తరగతి వంట ఖర్చు రూ. 89,64,900 లు, గుడ్డు ఖర్చు రూ. 1,16,20,200 రిలీజ్ చేసినట్టు పేర్కొన్నారు. సంబంధిత మండల విద్యాధికారులు అందరూ 9, 10వ తరగతులకు సంబందించి మధ్యాహ్న భోజన బిల్లులను ట్రెజర్లకు సమర్పించారని తెలిపారు. టోకెన్ నెంబర్లు గవర్నమెంట్‌కు పంపామని ఒకటి నుండి 8 వ తరగతికి సంబందించి మధ్యాహ్న భోజన బిల్లులు పిఎఫ్ఎంఎస్ ద్వారా రెండు మూడు రోజుల్లో బిల్లులు విడుదల అవుతాయని పేర్కొన్నారు.

మూడు రోజులు మధ్యాహ్న భోజనం బంద్

- ఎంఈవోకు వినతి

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు మూడు రోజులు మధ్యాహ్న భోజన పథకాన్ని బందు చేస్తున్నట్లు మండల ఎంఈఓ రాజ్ గంగారెడ్డికి వినతి పత్రం గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికులకు 2022 మార్చి బడ్జెట్ సమావేశాల సందర్భంగా వేతనాలు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించినప్పటి నుండి ఏరియర్స్ తో సహా జీఓ నెం. 8 ప్రకారం చెల్లించాలని, కొత్తమెనూ సవరించాలని, పెండింగ్ బిల్లులు తక్షణం విడుదల చేయాలని, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ అక్షయ పాత్రకు అప్పజెప్పడాన్ని విరమించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఈడిమాండ్ల సాధనకు ఈనెల 10, 11, 12 తేదీల్లో మధ్యాహ్న భోజన కార్మికులు వంట బంద్ పెట్టి టోకెన్ సమ్మె చేస్తున్నామని తెలిపారు. గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, గుర్తింపు కార్డులు ప్రభుత్వమే ఇవ్వాలని, అక్రమ తొలగింపులు అరికట్టాలని , రాజకీయ వేధింపులు ఆపాలని అన్నారు. వంట షెడ్లు, వంట పాత్రలు తదితర మౌలిక వసతులు కల్పించాలని, కాటన్ బట్టల యూనిఫామ్ ఇవ్వాలని, ప్రమాద బీమా, పెఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఎలాంటి షరతులు లేకుండా బ్యాంక్ ద్వారా రుణాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న బోజన కార్మికుల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండ గంగాధర్, మండల అధ్యక్షులు మర్వాడి బలారజ్ పాల్గొన్నారు.



కేక్ కట్‌చేస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

కేసీఆర్ నాటిన మొక్కకు బర్త్‌డే

నవతెలంగాణ-వేల్పూర్

సరిగ్గా 8 సంవత్సరాల క్రితం జులై 6 2015న మొదటి విడత హరిత హారంలో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ వేల్పూర్ మండల కేంద్రంలోని మంత్రి ఇంటి ఆవరణలో నాటిన మొక్క 8 సంవత్సరాలు పూర్తి చేసుకొని 9 వ సంవత్సరం లోకి అడుగిడిన సందర్భంగా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గురువారం కేక్ కట్ చేసి చెట్టుకు పుట్టిన రోజు వేడుకలు జరిపారు. .ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ చేపట్టిన హరితహారం కార్యక్రమం చాలా గొప్ప నిర్ణయం అని అన్నారు. ఇది ఓట్ల కోసం చేసేది కాదని భావి తరాల భవిష్యత్తు కోసం చేపట్టిన కార్యక్రమం అని అన్నారు. ప్రపంచం మొత్తం అడవుల శాతం తగ్గిపోతుంటే మన తెలంగాణ లో మాత్రం ముఖ్యమంత్రి కేసీఆర్ చర్యల వల్ల 7.7 శాతం అడవులు పెరిగాయి అని అన్నారు. మొక్కలు సంరక్షించడం నాటడం మన అందరి బాధ్యత అని మంత్రి అన్నారు.

ఎస్సీ హాస్టల్‌లో దుప్పట్లు బుక్స్ పంపిణీ

నవతెలంగాణ-వేల్పూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకి అందిస్తున్న స్టడీ మెటీరియల్స్, స్కూల్ డ్రెస్సులు, దుప్పట్లు, బుక్స్ 10 రకాల వస్తువులను మండల కేంద్రంలో ఎస్సి హాస్టల్‌లో విద్యార్థులకు వార్డెన్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో సర్పంచ్, ఉపసర్పంచ్, ఎంపీటీసీ, కలిసి గురువారం పంపిణీ చేశారు. హీటర్ ప్లాంట్ అందజేసిన రాష్ట్ర రోడ్ల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి వార్డెన్, విద్యార్థుల తల్లి తండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

రైతు పక్షపతి సీఎం

నవతెలంగాణ-మోర్తాడ్

రైతు సంక్షేమం కోసం పాటుపడే వ్యక్తి సీఎం కేసీఆర్ అని మంత్రి ప్రశాంత్ రెడ్డి అన్నారు. రైతులు పండించే పంటకు నీటి కొరత లేకుండా ఉండడానికే కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని రూపొందించి రివర్స్ పంపింగ్ ద్వారా ఎస్సారెస్పీకి నీటిని తేవడానికి భారీ ప్రణాళికతో ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని తెప్పించిన ఘనత సీఎం కే ఉందని అన్నారు. ఎస్సారెస్పీ పునర్జీవన పథకం లో పాలు పంచుకోవడం తనకు ఎంతో గర్వంగా ఉందని మంత్రి ప్రశాంత్ రెడ్డి అన్నారు. మండలంలోని తిమ్మాపూర్, పాలెం, దొనకల్ గ్రామాలకు తాకిన నీటిని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మండల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బిజెపీ, బీఆర్‌ఎస్‌లది ఫెవికాల్ బంధం

- వేణుగోపాల్ యాదవ్

నవతెలంగాణ-భీంగల్

బిజెపి, బీఆర్ఎస్ పార్టీలది ఫెవికాల్ బంధం అని టిపిసిసి అధికార ప్రతినిధి వేణు గోపాల్ యాదవ్ అన్నారు. గురువారం భీంగల్ పట్టణకేంద్రంలో విలేకరు సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో భారతీయ జనతా పార్టీ , రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీలు అనుసరిస్తున్న విధానాలు ఫెవికాల్ బంధంగా ఒకే విధంగా ఉన్నాయని అన్నారు . కేసీఆర్ భారతీయ జనతా పార్టీ నాయకులతో డిల్లీలో కలిసిన తర్వత రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న బండి సంజయ్‌ను తప్పించి కిషన్ రెడ్డిని అధ్యక్షునిగా నియమించడం ఇందకు నిదర్శనమని అన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ యూనివర్సిటీలో పూర్తిస్థాయి విసి, రిజిస్టర్‌ను ఇయమించకపోవడంతో అక్కడ అస్తవ్యస్తంగా ఉందన్నారు. తక్షణమే ఉన్న సమస్యలను పరిష్కరించకపోతే కాంగ్రెస్ అనుబంధ సంస్థ ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని తెలిపారు. సమావేశంలో మండల అధ్యక్షుడు స్వామి, కుంట రమేష్, జేజే నర్సయ్య, గోపాల్‌నాయక్, నాగేంద్ర, మండల నాయకులు పాల్గొన్నారు.

బదిలీలు ప్రమోషన్లు చేపట్టాలి : టీపీటీఎఫ్



మాట్లాడుతున్న అశోక్‌కుమార్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉపాధ్యాయులకు బదిలీలు ప్రమోషన్లు వెంటనే చేపట్టాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం టీఎన్జీవోస్ భవన్‌లో టిపిటిఎఫ్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు వెనిగళ్ళ సురేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బదిలీలు పదోన్నతులు లేక విద్యారంగం పూర్తిగా నిర్వీర్యమైందని, రాష్ట్ర ప్రభుత్వం విద్యను గాలికి వదిలేసిందని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి మాట్లాడుతూ స్కూళ్లలో నైట్ వాచ్మెన్ ,సర్వీస్ పర్సన్స్ లేక ఉపాధ్యాయులే ఆ పని చేసుకోవాల్సి వస్తుందని, ఇది సిగ్గుచేటని అన్నారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్ మాట్లాడుతూ పిఆర్సి కాలపరిమితి అయిపోయినందున వెంటనే నూతన పిఆర్సి వేయాలనీ తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు అరవిందు చందర్, కేసి లింగం మల్కన్నా నగేష్ మల్లేశం గంగా ప్రసాద్ ఇబ్రహీంలు , అలీం, శివ నాగమణి పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తా : మాజీ మేయర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని వెజిటేబుల్ మార్కెట్ ను గురువారం ఉదయం 4 గంటలకు మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ సందర్శించారు. రైతులను కలిసి వారితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడున్న కూరగాయ వ్యాపారులు, మార్కెట్లో ఉన్న రైతులతో మాట్లాడారు. అనంతదరం మాజీ మేయర్ సంజయ్ మాట్లాడుతూ.. రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అందరికి వర్షాకాలంలో వ్యాపారాలకు వెసులుబాటుగా ఉండేలా ఇక్కడే షెల్టర్‌ని ఏర్పాటు చేసేవిధంగా చేస్తానని, సమస్యలకు పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

లక్ష్యసాధనకు కృషిచేయాలి

ఏసీపీ కిరణ్‌కుమార్

విజయ్ హైస్కూల్లో అంతర్గత క్రీడోత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రతి విద్యార్థికి ఒక ఆశయం ఉండాలనీ, ఆ ఆశయాన్ని చేరుకోవడానికి కృషిచేయాలని అన్నారు. ఏసీపీ కిరణ్‌కుమార్ అన్నారు. విజయ్ హైస్కూల్లో 26వ అంతర్గత క్రీడా పోటీలు గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏసిపి యం.కిరణ్ కుమార్, అకడమిక్ డైరెక్టర్ టి.వసంత జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొన్న విద్యార్థుల నుండి జ్యోతిని అందుకొని వెలిగించారు. కరెస్పాండెంట్ వి. ప్రభాదేవి క్రీడా పతాకాన్ని ఎగురవేసి, అనంతరం విద్యార్థుల నుండి మార్చి పాస్ట్ గౌరవ వందనం స్వీకరించి క్రీడలను ప్రారంభించారు. తల్లిదండ్రులూ, ఉపాధ్యాయులూ చెప్పిన మాటలు తూచాతప్పకుండా పాటించా లని, అప్పుడే విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకుంటారని అన్నారు. ప్రారంభ వేడుకల్లో భాగంగా వాలీబాల్, హ్యాండ్‌బాల్, ఖో-ఖో, రిలేరేస్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



క్రీడ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

హాస్టల్ పరిసరాల్లో పిచ్చి మొక్కలు తొలగించాలి

ఎంపిడిఓ లక్ష్మణ్

నవతెలంగాణ-ధర్పల్లి



మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలోని బాలికల హాస్టల్ పరిసర ప్రాంతంలో మొలిచిన పిచ్చి మొక్కలను తొలగించి ఉపాధి హామీ కూలీల ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని ఎంపిడిఓ లక్ష్మణ్ ఫీల్డ్ అసిస్టెంట్ ను ఆదేశించారు. వర్షాకాలం దృశ్య విద్యార్థులకు ఇబ్బందులు కల్గకుండా పాఠశాల పరిసర ప్రాంతాన్ని హరిత వనంగా, అహ్లాదకరంగా తీర్చి దిద్దాలని తెలిపారు. పనులు వెంటనే పూర్తి చేసేవిధంగా చర్యలు చేపట్టాలని అదేహించారు. అనంతరం మోడల్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అయన వెంట గ్రామ సర్పంచ్ ఆర్మూర్ పెద్ద బాలరాజ్, సొసైటీ చైర్మెన్ చెలిమెల మల్లికార్జున్, లాలగౌడ్ శ్రీనివాస్ గౌడ్, రాజేష్, పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్ర సాహు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులను కూలగొట్టే అధికారం ఎవరిచ్చారు : సీపీఐ

నవతెలంగాణనిజామాబాద్ సిటీ

ప్రభుత్వ ఆస్తులను కూలగొట్టి, చెట్లు నరికి వేసే అధికారం ఎవరిచ్చారని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. గురువారం ఇందూర్ టూరిజం హోటల్‌ను సీపీఐ బృందం సందర్శించారు. హరిత టూరిజం హోటల్ రెస్టారెంట్‌కు సంబంధించిన ఇంటీరియర్‌ను ఎలాంటి అనుమతులు, టెండర్లు లేకుండా ప్రస్తుతమున్న సంతోష్ ధాబాలో నీళ్ల వస్తున్నాయనే పేరుతో హోటల్ కింద ఉన్న రెస్టారెంట్లోకి సంతోష్ ధాబాను మార్చడం కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం నడుపుతున్న సంతోష్ దాబా గతంలో పంచవటి సూపర్ మార్కెట్ వారికె టెండర్ ఉండేదని టెండర్ కాల పరిమితి ముగిసి ఎన్నో సంవత్సరాలు ఐనప్పటికీ రెస్టారెంట్‌కు సంబంధించిన సామాగ్రిని తిరిగి అప్పజెప్పకుండా టూరిజం శాఖకు చెల్లించాల్సిన లక్షల రూపాయల బకాయిలను నిలిపి వేశారని అన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న సంతోష్ ధాబా, రాజన్న హోటల్ సబ్ కాంట్రాక్ట్ కు ఇచ్చుకునే హక్కు పంచవటి సూపర్ మార్కెట్ యాజమాన్యంకు ఎవరు ఇచ్చారని, ఇది ముమ్మాటికి టూరిజం శాఖ అధికారుల అలసత్వమేనని అన్నారు. 2012లో టూరిజం హోటల్ ప్రైవేటుపరం చేయాలని నాటి ప్రభుత్వం నిర్ణయం చేసినప్పుడు నిజామాబాద్‌లో సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహించి ప్రభుత్వ ఆధీనంలో ఉండే విధంగా నిర్ణయం చేయించినట్టు తెలిపారు. నాడు 49 మంది కార్మికులు టూరిజం హోటల్ లో ఉంటే ప్రస్తుతం ఇద్దరితో మాత్రమే కొనసాగిస్తూ ప్రైవేటుపరం చేయడానికి పూనుకుంటున్నారని అన్నారు. టూరిజం శాఖ ప్రభుత్వ ఆధీనంలో ఉంచి నడపాల్సిన బార్, రెస్టారెంట్, హోటల్ ను ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు పంచవటి సూపర్ మార్కెట్, టూరిజం శాఖ వారు చెల్లించాల్సిన ప్రాపర్టీ టాక్స్, నీటి బిల్లు, ఇతర మున్సిపల్ టాక్సు నామమాత్రంగా చెల్లిస్తూ మున్సిపల్ శాఖకు ఆర్థికంగా నష్టపరుస్తున్నారని మున్సిపల్ అధికారులకు తెలియపరిచిన నిర్లక్ష్యం వహిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పటికైనా టూరిజం శాఖ అధికారులు స్పందించి అధికారికంగా టెండర్లు లేనటువంటి హోటల్ లను తొలగించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు బి.రఘురాం, కే గంగాధర్, అలీ ఇమ్రాన్, ఫెరోజ్ ఆలీ, హనుమాన్లు, సురేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుని నియామకం

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులుగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాయిబాబా గౌడ్ గురువారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా సాయిబాబా గౌడ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అందరిని సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తానని అన్నారు. బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆశయాలు కొనసాగిస్తూ ముందుకు వెళ్తాం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/ఆర్మూర్

బాబుజగ్జీవన్‌రామ్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఆయన ఆశయాలను కొనసాగిస్తూ తెలుగుదేశం పార్టీ ముందుకు వెళుతుందని పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదాగౌడ్ అన్నారు. బాబు జగ్జీవన్ రావ్ 37వ వర్ధంతి సందర్భంగా జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్జీవన్‌రావ్ స్వతంత్ర సమరయోధుడు సంఘసంస్కర్త అని, ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెంజర్ల సురేష్, అర్బన్ సీనియర్ నాయకులు అంబికా సత్యనారాయణ, లవంగా రాజు, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ రఫీక్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి టీఎస్ ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ దేవన్న ఆధ్వర్యంలో ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, అవార్డు గ్రహీత మోతే భూమాన్న హాజరై మాట్లాడుతూ యువత జీవన్ రామ్ అడుగుజాడల్లో ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో టీఎస్ ఎంఆర్పిఎస్ జిల్లా అధికార ప్రతినిధి పొన్నాల సంజీవయ్య, జిల్లా ఉపాధ్యక్షులు కన్నుల రాములు, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ ప్రజలను మభ్యపెడుతున్నారు..

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేష్‌రెడ్డి



మాట్లాడుతున్న నగేష్‌రెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

పల్లె పల్లె కు నగేష్ అన్న" 'గడప గడపకు కాంగ్రెస్"కార్యక్రమం ను మండలంలోని అమృతాపూర్ గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాటిపల్లి నగేష్ రెడ్డి మాట్లాడుతూ తొమ్మిదేండ్ల బీఆర్ఎస్, బిజెపి పాలనతో ప్రజలు విసుగు చెందరని, వీరి పాలనలో ఎలాంటి అభివృద్ధి చేయకుండా ప్రజలకు మభ్య పెట్టే కార్యక్రమాలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ములన పడ్డ వాటిని పూర్తి చేయడం జరుగుతుందని, అన్ని హామీ లను అమలు చేసి చుపుతమన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు కేతావత్ యాదగిరి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అమృతపూర్ గంగాధర్, రూరల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పోలసాని శ్రీనివాస్, ఎంపిటిసి చినోళ్ల నర్సయ్య మండల ఒబిసి సెల్ అధ్యక్షులు రాజన్న, సీనియర్ నాయకులు నారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయాలి

- నమస్తే నవనాథపురం కార్యక్రమంలో ఎమ్మెల్యే జీవన్ రెడ్డి
- 12కోట్లతో సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభం

నవతెలంగాణ-నందిపేట్

రాహుల్ గాంధీకి దమ్ముంటే హామీలు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. 'నమస్తే నవనాథపురం' కార్యక్రమంలో భాగంగా గురువారం జీవన్ రెడ్డి నందిపేట్ లో పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ప్రతీ ఒక్కరినీ పలకరిస్తూ మంచీ చెడుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. 12కోట్లతో సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ నాయకులు గ్రామాలకొస్తే ప్రజలు చెప్పులతో కొట్టాలన్నారు. నందిపేట్ కు వచ్చే సమయంలో మార్గమధ్యంలో అశోక్, ప్రశాంత్, సాగర్, ఎర్రోళ్ల పెద ముత్యం తదితర వికలాంగులు కలిసి మీరు తిరగాలిసిన పనిలేదు... మన ప్రభుత్వం, మన కేసీఆర్, మీరు పనిచేయడం లేదన్న గాడిద ఎవడు?. మా తల్లి తండ్రుల కన్నా ఎక్కువగా మాకు అండగా నిలిచిన కేసీఆర్ ప్రభుత్వాన్ని కాపాడుకునే బాధ్యత మాది. మాకు రూ.4016 చొప్పున పెన్షన్లు ఇస్తున్న బీఆర్ఎస్ ను గెలిపించాలని ఆర్మూర్ నియోజకవర్గంలోని మొత్తం 5వేల మంది వికలాంగులం మాకుటుంబ సభ్యులతో కలిసి ప్రచారం చేస్తామని చెప్పింద్రు' అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, జడ్పీటీసీ ఎర్రం యమునా ముత్యం, సర్పంచు వాణి తిరుపతి, ఎంపీపీ సంతోష్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మచ్చర్ల సాగర్ ,నాయకులు చెక్ చెక్ ముత్యం, లింగం, ఉల్లి శ్రీనివాస్ గౌడ్, సుధాకర్ గౌడ్, బాల గంగాధర్, మచ్చర్ల విజయ్ తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రజలను వేధిస్తున్న ప్రభుత్వాలను ఓడించాలి

మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-నవీపేట్

ప్రజల ఓట్లతో గెలిచి ప్రజలనే వేధిస్తున్న ప్రభుత్వాలను ఓడించాలని మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో బూత్ ఏజెంట్ల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ తన హయాంలోనే ప్రాజెక్టులు, పాఠశాలలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఆస్పత్రులు నిర్మించినవని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఒక్క అభివృద్ధి చేసిందా.. అని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో 50 వేల కోట్ల బడ్జెట్‌తోనే ఎంతో అభివృద్ధి చేశామని, కానీ బిఆర్ఎస్ ప్రభుత్వంలో 2లక్షల 40వేల కోట్ల బడ్జెట్‌తో ఎటువంటి అభివృద్ధి జరగలేదని అన్నారు. ఎన్నికల్లో బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకపోగా ధరలు ఆకాశాన్ని అంటేలా చేశారని అన్నారు. కేసీఆర్ కుటుంబ ప్రయోజనాల కోసమే ధరణి తీసుకొచ్చారని, తమ ప్రభుత్వం రాగానే ధరణిని రద్దు చేస్తామని అన్నారు. అంతకుముందు కమలాపూర్ గ్రామంలో పార్టీ నాయకులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వృద్ధులతో మాట్లాడుతూ పెద్దకొడుకు పింఛన్ పేరుతో ధరలు పెంచి నామం పెట్టాడంటూ మంత్రి చెప్పగా ఓ వృద్ధురాలు సంక్షేమ ప్రభుత్వమైన కాంగ్రెస్‌కు నామం పెట్టి మాకు సున్నం పెట్టాడంటూ చెప్పడంతో అక్కడ వున్న వారంతా నవ్వుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 4 వేల రూపాయల పింఛన్ ఇస్తామని అన్నారు. కమలాపూర్, నవీపేట్‌లో కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తాహెర్ బిన్ హందాన్, పార్టీ మండల అధ్యక్షులు సుధాకర్ రావు, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, సాయరెడ్డి, భగవాన్, బాబు, మూస తదితరులు పాల్గొన్నారు.

బట్టాపూర్ క్వారీ మూసివేతకు హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది

- బీజేపీ మండల అధ్యక్షులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/వేల్పూర్/భీంగల్

ఏర్గట్ల మండలంలోని బట్టాపూర్ అక్రమ క్వారీ మూసివేతకు తెలంగాణ హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని బీజేపీ కమ్మర్ పల్లి మండల అధ్యక్షులు కట్ట సంజీవ్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్వారీకి అన్నీ అనుమతులు ఉన్నాయన్న మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి హైకోర్టులో చుక్కెదురైందన్నారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి సమాచార హక్కు చట్టం ద్వారా బట్టాపూర్ క్వారీలో జరుగుతున్న అక్రమాల వివరాలను సేకరించడం జరిగిందన్నారు. ఉన్నతాధికారు లకు ఫిర్యాధులు చేసిన ప్రయోజనం లేకపోవడంతో హైకోర్టులో మల్లికార్జున్ రెడ్డి ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు చేసినట్లు తెలిపారు. క్వారీలో అక్రమాలు జరుగుతున్నది వాస్తవమని, పర్యావరణ అనుమతులు లేకుండా, ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్న బట్టాపూర్ క్వారీని తక్షణమే మూసివేసే ప్రక్రియ ప్రారంభించాలని కాలుష్య నియంత్రణ మండలికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని కట్ట సంజీవ్ తెలిపారు. ఎలాంటి అక్రమాలు జరగడం లేదని, అన్ని అనుమతులు ఉన్నాయని మీడియా ముందర సవాల్ చేసిన మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి హైకోర్టులో చుక్కెదురైందన్నారు. ఈసందర్భంగా బిజెపి నాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి బద్దం రమేష్, కొమ్ముల సంతోష్, రేంజేర్ల గంగాధర్, ఎలాల వెంకట్ రెడ్డి, కొత్తపల్లి అరుణ్, పటేరి రాజ్ కుమార్, బొక్కేనా మురళి, భాగ్యరాజ్, రాజేందర్, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

వేల్పూర్:మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ బాల్కొండ కన్వీనర్ మల్కన్న మోహన్, మండల అధ్యక్షులు ఏలేటి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. అక్రమాలు జరగకుంటే క్వారీని మూసివేయాలని హైకోర్టు ఆదేశాలు ఎందుకు ఇస్తుందని మండిపడ్డారు. అభివృద్ధి పేరుతో ప్రజలను మోసం చేస్తూ కమిషన్లు తీసుకుంటు అక్రమాలకు పాల్పడుతున్న మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి రాబోయే ఎన్నికలలో ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీజేవైఎం అధ్యక్షుడు పడిగెల సురేష్, రామన్నపేట ఉప సర్పంచ్ బేల్దారి నవీన్, వేల్పూర్ నర్సయ్య, సచిన్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లి : మాట్లాడుతున్న మండల నాయకులు

భీంగల్:బట్టాపూర్ క్వార్టీ క్వారీని మూసివేయించాలని కాలుష్య నియంత్రణ మండలికి ఇదేశాలు జారీ చేయడంతో బీజేపీ మండల నాయకుల బస్టాండ్ ప్రాంతంలో టపాసులు పేల్చి సంబురాలు జరుపుకున్నట్టు తెలిపారు.

నవతెలంగాణ
కామారెడ్డి
3
శుక్రవారం 07 జూలై 2023

ప్రతి కూలికి ఉపాధి పనులు కల్పించాలి

ఎంపీడీవో గోపాలకృష్ణ

నవతెలంగాణ-ఎడపల్లి

మండలం అన్ని గ్రామాలలో ఉపాధి పనులను వేగవంతం చేసేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది కృషి చేయాలని ఎడపలి. ఎంపీడీవో. గోపాలకృష్ణ అన్నారు. అలాగే వర్షాకాలం ప్రారంభమైన. దృష్ట్యా ప్రతి ఒక్కరు ఐదు మొక్కలు నాటే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సుమారు 40 వేల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఆయన అన్నారు. ప్రభుత్వ కార్యాలయ ఆవరణంలో తప్పకుండా మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందిపై ఉందన్నారు. ఆరవ విడత హరిత హారాన్ని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన నొక్కి చెప్పారు. సమావేశంలో ఉపదామి ఏపీ ఓ గంగారం, టెక్నికల్ అసిస్టెంట్ జ్యోతి, కంప్యూటర్ ఆపరేటర్ సాగర్, ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

18 ఏండ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలి

- ఎడపల్లి తహసీల్దార్ ఆకుల శేఖర్

నవతెలంగాణ-ఎడపల్లి

18 ఏండ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎడపల్లి తహసీల్దార్ ఆకుల శేఖర్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని బూతు లెవెల్ స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీఎల్వోలు గ్రామపంచాయతీ కార్యదర్శులు తమ తమ గ్రామాలలో అందుబాటులో ఉండాలన్నారు. ఓటర్‌గా నమోదు కావడానికి ఫామ్ 6 నింపాలన్నారు. ఓటర్ లిస్టులో చనిపోయిన వారి పేర్లు ఉంటే తప్పకుండా తొలగించాలన్నారు. సొంత గ్రామం నుంచి ఇతర గ్రామాలకు వలస వెళ్ళిన వారిని గుర్తించి వారికి ఓటర్ కార్డు ఉందా లేదా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

యాంటీ రేబిస్ టీకాలు వేయించాలి

- పెంపుడు కుక్కలకు తప్పనిసరి
- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్
- పలుచోట్ల టీకాలు ప్రారంభం

నవతెలంగాణ-విలేకరుల బృందం

తాడ్వాయి : పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా యాంటీ రేబిస్ టీకాలు వేయించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి ప్రాంతీయ వైద్యశాల ఆవరణలో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా కుక్కలకు ఉచిత యాంటీ రాబిస్ టీకాలు వేసే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పెంపుడు జంతువుల పట్ల ప్రేమ భావాన్ని పెంచుకోవాలని తెలిపారు. పెంపుడు జంతువుల పట్ల పిల్లలు ద్వేషం పెంచుకోవద్దని సూచించారు. ప్రతి సంవత్సరానికి ఒకసారి టీకాలు వేయించుకొని రేబిస్ వ్యాధిని నివారించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సింహరావ్, వైద్యులు విజయ భాస్కర్, దేవేందర్, సంజయ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



తాడ్వాయిలో యాంటీ రెబీస్ వ్యాక్సిన్ వేస్తున్న దృశం

కుక్కలకు యాంటీ రెబీస్ వ్యాక్సిన్ టీకా వేసి ప్రారంభించిన ప్రజా ప్రతినిధులు..

దోమకొండ : మండల కేంద్రంలోని పశు వైద్య శాలలో ప్రపంచ జొనోసిస్‌డే సందర్భంగా కుక్కలకు యాంటి రేబిస్ వ్యాక్సిన్ శిబిరం కార్యక్రమన్ని జెడ్పీటీసీ సభ్యులు తిర్మల్‌గౌడ్, వెటర్నరీ ఏడీ శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో దోమకొండ సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, సర్పంచ్ నల్లపు అంజలి శ్రీనివాస్, మండల వైద్యాధికారి శివ, ఎల్ఎస్ఏ అయోధ్య, పశువైద్య సిబ్బంది రమేష్‌బాబు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ : మండలంలోని పశువైద్య కేంద్రంలో పెంపుడు జంతువులకు టీకాలు వేయించారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో పశువైద్యశాల ఆధ్వర్యంలో ప్రపంచ జోనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు టీకాలను ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ పాల్గొన్నారు.



గాంధారిలో యాంటీ రెబీస్ వ్యాక్సిన్ వేయిస్తున్న గ్రామస్తులు

గాంధారి : మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు యాంటీరేబిస్ టీకాలు గ్రామంలోని పెంపుడు కుక్కలకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు శంకర్ నాయక్, ఏఎంసీ మాజీ చైర్మెన్ సత్యం, బీఆర్ఎస్ నాయకులు బలరాం, నితీన్ తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూర్: మండలంలోని సిద్ధిరామేశ్వరనగర్ గ్రామంలో పశువైద్యాధికారి దేవేందర్ ఆధ్వర్యంలో కుక్కలకు ఏంటి ర్యాబిస్ టీకాలను వేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జనగామ శ్రీనివాస్, ఉప సర్పంచ్ లతా సుధాకర్, ఎంపీటీసీ మీనా దుర్గబాబు, వీడీసీ చైర్మన్ బలరామ్, అరుణ్, రాజు, రమేష్, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాసర త్రిపుల్ ఐటీకి ఎంపికైన సాలురు హైస్కూల్ విద్యార్థిని

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించి 9.7 జీపీఏ సాధించిన ఎస్.నవనీత బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడంతో గురువారం పాఠశాలలో ఉపాధ్యాయులు, తహసీల్దార్ గ్రామపెద్దలు విద్యార్థికి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన సాలూర మండల తహసీల్దార్ మమత మాట్లాడుతూ.. విద్యార్థులు నవనీతను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. నవనీత బాసర ఐఐఐటీలో సీటు సాధించడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం తహసీల్దార్ విద్యార్థి నవనీతకు రూ.2వేల నగదు బహుమతి అందించారు. అలాగే రిటైర్డ్ ఉపాధ్యాయులు ఇల్లెపు గంగారం, పాఠశాల ఉపాధ్యాయులు రూ.వేల నగదు సహాయం అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం సాయిలు, విద్యాకమిటీ చైర్మన్ లక్ష్మణ్, పూర్వ విద్యార్థుల కమిటీ ప్రతినిధి అల్లే జనార్దన్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కోట్ల రూపాయలతో అభివృద్ధి

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

నవతెలంగాణ-తాడ్వాయి

మన రాష్ట్రం మనం సాధించుకున్నామని.. కాబట్టే కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసుకుంటున్నామని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. మాచారెడ్డి మండలం రత్నగిరిపల్లి గ్రామంలో సుమారు 1కోటి 83 లక్షల 55వేల రూపాయలతో చేపట్టిన పలు కుల సంఘాల భవన నిర్మాణాలకు, పల్లె ప్రకృతి వనం, వైకుంఠ ధామం, సీసీ రోడ్డు, బిటి రోడ్డు, మినీ ట్యాంక్ బండ్, తాగునీటి పనులకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం సాధించుకుని 9 ఏండ్లు పూర్తవుతుందని గతంలో గ్రామాల్లో ఎన్నడూ జరగని అభివృద్ధి ఇప్పుడు జరిగిందని అన్నారు. మన రాష్ట్రం మనం సాధించుకున్నాం కాబట్టే ఇన్ని కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేసుకున్నామని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. దేశంలో 67 ఏండ్లు పాలించిన పార్టీలు ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాతనే కామారెడ్డి జిల్లా కేంద్రంగా ఏర్పడిందని అన్నారు. అందులో భాగంగానే కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలు, మెడికల్ కళాశాలలు నిర్మించుకున్నామని అన్నారు. మన రాష్ట్రం మనం సాధించుకున్నాం. కాబట్టే కోట్ల రూపాయలు ఖర్చు చేసి పట్టణాల, గ్రామాల రూపురేఖలు మారాయని అన్నారు. పేద విద్యార్థుల కోసం సుమారు వంద రెసిడెన్షియల్ కళాశాలకు ఏర్పాటు చేసి వారికి నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. వచ్చే రోజుల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చి మన గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలి

- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

నవతెలంగాణ-బిచ్కుంద

కులాల పేరుతో రాజకీయం చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా మాట్లాడుతున్న మద్నూర్ మార్కెట్ కమిటీ అధ్యక్షులు సంగమేశ్వర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బిచ్కుంద మండలంలోని మున్నూరు కాపులు బిచ్కుంద పోలీస్ స్టేషన్లో ఎస్ఐ శ్రీధర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం మున్నూరు కాపులు మాట్లాడుతూ.. జుక్కల్ నియోజకవర్గంలో మున్నూరు కాపులు ఓపికతో, సహనంతో ఉన్నారని, కులాల మధ్య చిచ్చు పెట్టే విధంగా మాట్లాడుతూ.. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్న సంగమేశ్వర్ మున్నూరు కాపులతో పెట్టుకుంటే మద్నూర్ మండలంలో రాజకీయ పరంగా కనుమరుగైపోతావనీ కులాల మధ్యన చిచ్చు పెట్టడం మానేసి, చిల్లర రాజకీయాలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. సామాజిక కార్యకర్తగా సమాజ సేవ చేస్తున్న మున్నూరు కాపు ముద్దు బిడ్డ డాక్టర్ బండి విజయకి బహిరంగంగా క్షమాపన చెప్పాలని లేకుంటే నియోజకవర్గం, జిల్లా స్థాయిలో ఉద్యమం ఉధృతం చేస్తామని బిచ్కుంద మండల మున్నూరు కాపులు ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో బిచ్కుంద, గోపాన్‌పల్లి, పుల్కల్ గ్రామాల అధ్యక్షులు బాలరాజు, నల్బర్ శ్రీనివాస్, శెట్టిపల్లి విష్ణు, బొమ్మల లక్ష్మీన్, రమణ, బస్వరాజ్, ఆవార్ శ్రీను, సాయిని పండరి, దర్పల్ అశోక్, నల్బర్ విట్టల్, నాగం శంకర్, జీలకర్ర శ్రీకాంత్, శేఖర్, సాయిలు, కొట్టం అంజయ్య, కొట్టం హన్మాండ్లు, మండలంలోని ఆయా గ్రామల మున్నూరుకాపు ఉన్నారు.

కాంగ్రెస్ మండలాధ్యక్షుల నియామకం

నవతెలంగాణ-విలేకరుల బృందం

సదాశివనగర్ : సదాశివనగర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా ఖాట్మండీ సంతోష్ పాటిల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మాజీమంత్రి మహమ్మద్ షబ్బీర్ అలీ, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జ్ వడ్డేపల్లి సుభాష్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గాంధారి : కాంగ్రెస్ పార్టీ గాంధారి మండల నూతన అధ్యక్షునిగా మండలంలోని లొంకతండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మోహన్ నాయక్‌ను నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా మోహన్ నాయక్ మాట్లాడుతూ అధిష్టానం తనపై నమ్మకంతో కాంగ్రెస్ పార్టీ గాంధారి మండల అధ్యక్షుడిగా నియమించినందుకు మాజీమంత్రి షబ్బీర్ అలీ, జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, నియోజకవర్గ ఇంచార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. మండలంలో పార్టీ పటిష్టానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.







నసురుల్లాబాద్ కాంగ్రెస్ మండలాధ్యక్షు డిగా నందుపటేల్..

నసురుల్లాబాద్ : నసురుల్లాబాద్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నందు పటేల్‌ను రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాష్ శ్రీనివాస్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు నందు పటేల్‌ను మరోసారి అవకాశం ఇవ్వడం పట్ల రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు కైలాష్ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఎస్ సంకల్ప యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

- యాత్రను విజయవంతం చేయండి
- రాష్ట్ర కార్యదర్శి సురేష్

నవతెలంగాణ-లింగంపేట్

జూలై 16 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా సీపీఎస్ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని టీఎస్‌పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి వడ్ల సురేష్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నల్లమడుగులో సీపీఎస్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎస్‌పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సురేష్ వడ్ల మాట్లాడుతూ.. జూలై 16నుంచి 31వరకు రాష్ట్రంలో సీపీఎస్ సంకల్ప యాత్ర నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయ, ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగ విరమణ పొందిన తర్వాత ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆర్థిక భద్రత సామాజిక భద్రత లేకపోవడం వల్ల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ఉద్యోగ విరమణ పొందిన సీపీఎస్ మిత్రులకు ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కల్పించే కనీస ఆసరా పెన్షన్ కన్న తక్కువగా పెన్షన్ రావడం వలన కుటుంబం పోషణ భారంగా మారిందని తెలిపారు. రాష్ట్రంలోని ఒక లక్ష 50వేల కుటుంబాలకు పాత పెన్షన్ వర్తింపజేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రమేష్, శ్రీనివాస్, కృష్ణమోహన్, రవిబాబు, రామారావు, దశరథ్, సంజీవ్, విశాలా, సువర్ణ, మేడం తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎస్ నాయకులు

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన సర్పంచ్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ లక్షెట్టి సాయిలు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని మహ్మదాబాద్ ప్రాథమికోన్నత, ఎంపీపీఎస్ పాఠశాలలో సర్పంచ్ లక్షెట్టి సాయిలు మధ్యాహ్న భోజనాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సాయిలు వంట ఏజెన్సీ వారితో మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన తాజా కూరగాయలతో వండిన ఆహారం మెనూ ప్రకారం వడ్డించాలని, ప్రతి విద్యార్థి గుడ్డు తప్పక తీసుకోవాలని పోషకాలు లభిస్తాయని అన్నారు. అనంతరం పిల్లలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, మంచి విద్యను ప్రభుత్వ పాఠశాలలో విద్య నభ్యసించే పేద విద్యార్థులకు అందించాలని పేర్కొన్నారు. సర్పంచ్ సాయిలుతో పాటు పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బలవర్ధకమైన బియ్యం విత్తనాలు ఉచితంగా పంపిణీ



ఫోర్టిఫైడ్ రైస్ ని అందజేస్తున్న చైర్మన్ మర్రి సదాశివరెడ్డి

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూరు ఎల్లారెడ్డి గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రిలయన్స్ వారి సౌజన్యంతో ఆరుగురు రైతులకు ఫోర్టిఫైడ్ రైస్ (బలవర్ధకమైన బియ్యం) విత్తనాలను స్థానిక సొసైటీ చైర్మన్ మర్రి సదాశివరెడ్డి ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫోర్టిఫైడ్ రైస్ ఐరన్, విటమిన్ ఏ, బీ, బీ-12, జింక్ తదితర పోషక నిల్వలు కలిగి ఉందని, ఈ బియ్యాన్ని మనము పండిస్తే మంచి ఆరోగ్యం సమకూరుతుందని తెలియజేశారు. రైతులు ఈ వడ్లు పండించి బియ్యంగా చేసి తమ చుట్టుపక్కల ఉన్న రైతులకు అందించాలని, పండించిన ధాన్యాన్ని కొంత భాగం విత్తనంగా ఇతర రైతులకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో రిలయన్స్ ప్రతినిధి వినాయక్, సొసైటీ డైరెక్టర్ భాస్కర్, సెక్రెటరీ బైరయ్య, రైతులు కట్ట రాజయ్య, కొండల్‌రెడ్డి, శేకెల్లి రంజిత్, ఆస మహేష్, ఆస రాజు, రంగ మోహన్, కాలమొల్ల అశోక్, సతీష్, లింగం, ప్రసాద్, సుధాకర్, రంగస్వామి, గంగాధర్, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ-సదాశివనగర్


మండలంలోని బీసీ హాస్టల్ విద్యార్థులకు బుక్స్ ట్రంక్ బాక్స్ బెడ్ షీట్‌ను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ గైని అనసూయ మాట్లాడుతూ.. పుస్తకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగలని ఆమె సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు బొల్లిపల్లి మహేందర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు పాపనోళ్ళ బీరయ్య, ఉపసర్పంచ్ వంకాయల రవి, సొసైటీ డైరెక్టర్ జనార్దన్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గాదరి అశోక్‌రెడ్డి, రాజయ్య, హాస్టల్ వార్డెన్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబ సభ్యులు మొక్కలు నాటాలి

- దోస్పల్లి సర్పంచ్ సునితా తుకారం పటేల్

నవతెలంగాణ-జుక్కల్

ప్రతి కుటుంబ సభ్యులు మొక్కలు నాటాలని దోస్పల్లి సర్పంచ్ సునితా తుకారం పటేల్ అన్నారు. గురువారం గ్రామంలో సర్పంచ్ ఇంటింటికి తిరిగి హోమ్ సీడ్ మొక్కలను ఒక్కొక్కరికి ఆరు పంపిణీ చేసి నాటించి సంరక్షణ బాధ్యత తీసుకునే విధంగా జేపీఎస్ జాదవ్ మనోహర్ గ్రామస్తులకు ప్రతిజ్ఞ చేయించారు. మొక్కల వలన ఉపయోగాలను గ్రామ యువ నాయకుడు కేశవ్ పాటిల్ మాట్లాడుతూ.. మొక్కలు నాటితే రాబోయే తరాలకు మేలు చేసిన వారమౌతామని, వర్షాలు సమృద్ధిగా పాడి పంటల బాగా పండి రైతులకు ఆర్థికాభివృద్ధి చెంతుతారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సువితా, ఉపసర్పంచ్, జేపీఎస్ జాదవ్ మనోహర్, అంగన్‌వాడీ టీచర్ శైలజా, యూత్ నాయకుడు కేశవ్ పటేల్, పాండు పటేల్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న గ్రామస్తులు

బీఆర్ఎస్‌తో మహిళల అభివృద్ధి

- కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

బీఆర్ఎస్‌తో మహిళల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 42 మంది లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అలాగే లబ్దిదారులకు తన స్వంత ఖర్చులతో ఒక్కో చీరను బహుమతిగా ఇచ్చారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని, అలాగే ఎల్లారెడ్డిలో తన హయాంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో సెంటర్ లైటింగ్, పెద్ద చెరువు కట్టపై బ్రిడ్జిల నిర్మాణం, అలాగే వంద పడకల ఆసుపత్రి బస్ స్టాండ్ వంటి నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల పనులు ఎల్లారెడ్డి ఎంతో వెనకబడిందని, కానీ తన హయాంలో పెండింగ్ పనులు అన్ని పూర్తి చేస్తున్నానని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, ఎంపీపీ మాధవి బలరాజ్ గౌడ్, జడ్పీటీసీ ఉష గౌడ్, మండల అధ్యక్షుడు జలందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కాశీ నారాయణ, బీఆర్ఎస్ సర్పంచ్‌లు రఘువీర్ గౌడ్, అశోక్‌రెడ్డి, ఎల్లయ్య రవీందర్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు అరవింద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మీ చెక్కులు అందుకున్న మహిళలు

ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడతాం

- కాంగ్రెస్ మండలాధ్యక్షులు నారెడ్డి శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ, ప్రజల పక్షాన నిలబడి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను, ప్రజల్లో మమేకమై కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ మంత్రి మహమ్మద్ షబ్బీర్ అలీ, జిల్లా అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి చొరవతో తనపై నమ్మకం ఉంచి, మండల పార్టీ అధ్యక్ష పదవి బాధ్యతలు అప్పగించినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని కృష్ణాజివాడి గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ షేర్ బద్దం తిరుపతిరెడ్డికి రూ.47వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కును సర్పంచ్ గురువారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ గ్రామ యూత్ అధ్యక్షులు బండిమీద అరవింద్ టిఆర్ఎస్ మాజీ గ్రామ అధ్యక్షులు రాజేందర్ రావు రైతుబంధు అధ్యక్షులు రామ్ రెడ్డి టిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోలీస్ గోపాల్ రావు. కృష్ణమూర్తి, లక్ష్మారెడ్డి కుమ్మరి జగన్ రమేష్ రావు నారాయణ రావు బాలరాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరిక

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని మోతే గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ వార్డు సభ్యులు సాయిలుతో పాటు పలువురు మాజీ మంత్రి మహ్మద్ షబ్బీర్ అలీ సమక్షంలో గురువారం చేరినట్టు కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జ్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి తెలిపారు. మోతే గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ వార్డు సభ్యులు సాయిలు, బీఆర్ఎస్ గ్రామ మాజీ అధ్యక్షులు ఆవుల నర్సింహులు, పలువురు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడంతో వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో పలువురు సభ్యులు చేరిక

జిల్లా అధ్యక్షుడిని కలిసిన మండలాధ్యక్షులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని కాంగ్రెస్ మండలాధ్యక్షులు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కైలాష్ శ్రీనివాస్‌ని గురువారం మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షులు మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండలాధ్యక్షుల బాధ్యతలు ఇచ్చినందుకు పెద్దలు టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి మహమ్మద్ అలీ షబ్బీర్‌కు ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డికి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మండలాధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, ఎల్లారెడ్డి పట్టణ అధ్యక్షులు ఆఫీజ్, నాగిరెడ్డిపేట్ మండలాధ్యక్షుడు ధనుంజయ్, లింగంపేట్ మండలాధ్యక్షులు చందు, తాడ్వాయి మండలాధ్యక్షులు స్వామిరెడ్డి, సదాశివనగర్ మండల అధ్యక్షుడు సంతోష్, గాంధారి మండల అధ్యక్షులు మోహన్ నాయక్, రామారెడ్డి మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



కైలాష్ శ్రీనివాస్‌ని కలసిన కాంగ్రెస్ సభ్యులు

ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని వజ్జపల్లి, మోడెగాం మొక్కలను పలు గ్రామాల్లో హరితహారంలో భాగంగా ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీ కార్యక్రమంలో వజ్జపల్లి సర్పంచ్ ఎర్రం నరసయ్య, ఉపసర్పంచ్ ప్రభాకర్, మోడెగాం సర్పంచ్ తిరుమలవ్వ, ఉపసర్పంచ్‌లు, ప్రభాకర్ రావు, రాజు సెక్రటరీలు ప్రవీణ్, మాధవిలత, గ్రామస్తులు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో ప్రముఖ వైద్యుడు మృతి

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణానికి చెందిన ఆర్ఎంపీ వైద్యులు హైమద్ గురువారం తెల్లవారు జాము న గుండెపోటుతో మరణించారు. గత కొన్ని సంవత్సరాల నుంచి భిక్కనూర్ పట్టణంలో రోగులకు వైద్యం చేస్తూ మంచి పేరు సంపాదించుకున్నారు. డాక్టర్ హైమద్ హఠాన్మరణంతో పట్టణంలో విషాదఛాయలు అనుముకున్నాయి. డాక్టర్ మరణ వార్తతో పలువురు నివాళులర్పించారు.

నేడు ఆలయంలో సంతోషిమాత వార్షికోత్సవం

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని నగరేశ్వర ఆలయంలో సంతోషిమాత వార్షికోత్సవాన్ని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

నవతెలంగాణ-నవీపేట్

మండల కేంద్రానికి చెందిన ఎర్ర కావ్య బుధవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం మేరకు గురువారం ఉదయం నిజామాబాద్ ఏసిపి కిరణ్ కుమార్ సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నిజామాబాద్ వినాయక్ నగర్ కు చెందిన కావ్యతో ఏడాదిన్నర క్రితం మండల కేంద్రానికి చెందిన మనోజ్ కు వివాహం కాగా మనోజ్ వివాహేతర సంబంధం కారణంగా ఎప్పుడు గొడవలు జరిగేవని అన్నారు. రెండు మూడు సార్లు పెద్దమనుషులతో మాట్లాడిన మనోజ్ తీరు మారకపోవడం, భర్త కుటుంబానికి అప్పులు కావడంతో వరకట్న వేధింపుల కారణంగా కావ్య మనస్తాపం చెంది ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుందని కావ్య తండ్రి రాజేందర్ ఫిర్యాదు మేరకు మతురాలి భర్త మనోజ్, మామ మహేష్, అత్త అరుణపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు ఆయన వెంట తహసీల్దార్ వీర్ సింగ్, సిఐ రాజారెడ్డి ఉన్నారు.

సంక్షేమ హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని పిడిఎయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం. నరేందర్, కర్క గణేష్ లు అన్నారు. నిజామాబాద్ జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ బాలుర బాలికల హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని ఏవో ప్రశాంత్ కు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యు) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్‌లో ప్రతిసంవత్సరం సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. పెండింగ్లో ఉన్నటువంటి మెస్, కాస్మోటిక్ బకాయిలను విడుదల చేయాలని, పర్మినెంట్ వసతి గహాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క విద్యార్థికి వసతి గహంలో ప్రవేశం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కే అశూర్, అనిల్ జిల్లా సహాయ కార్యదర్శులు దుర్గా ప్రసాద్, కోశాధికారి నిఖిల్, నాయకులు రంజాన్, వసీం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖ ఏడికి వినతి

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ విద్యార్థి పరిషత్ నగర అధ్యక్షుడు అఖిల్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ ఏడీకి క్షతియ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నగర అధ్యక్షుడు అఖిల్ మాట్లాడుతూ.. ఆర్మూర్ పట్టణంలోని ఓ పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు విద్యార్థులతో వస్తుండగా వేల్పూర్ మండలంలో జాతీయ రహదారిపై 65పై బస్ టైర్ బ్లాస్ట్ అయిందన్నారు. ఈ ఘటన జరిగినప్పుడు బస్సులో పరిమితికి నుంచి విద్యార్థులు ఉన్నారని తెలిపారు. పాఠశాల బస్సుకి ఫిట్నెస్ ఉన్నది లేనిది విచారణ జరిపించి, ఫిట్నెస్ లేకుంటే పాఠశాల గుర్తింపు రద్దు చెయ్యాలని అన్నారు. పలు పాఠశాలల్లో బస్సులకు ఫిట్‌నెస్ లేదని, ఫిట్నెస్ లేని బస్సులో నడుపుతున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఫిట్నెస్ సర్టిఫికెట్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పొందుపరచని పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని, అలాగే ఫిట్‌నెస్ పొందిన పాఠశాల లిస్ట్ బహిర్గతం చేయాలని అన్నారు. ఒక వేళ టైర్ పలిగిన సందర్భంలో ప్రమాదం జరిగితే విద్యార్థుల ప్రాణాలకు బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. కార్యక్రమంలో మనోజ్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీకి వీసీని నియమించాలి

- ఈసీ తీర్మానాలు అమలు చేయాలి
- యూనివర్సిటీ సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన జన్నారపు రాజేశ్వర్ అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ పిడిఎస్‌యూ కమిటీ సమావేశం యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాలలో గురువారం నిర్వహించి పలు తీర్మానాలను ఆమోదించారు. జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ టీయూ వీసీ లేనందున కాన్వొకేషన్ మైగ్రేషన్, విదేశాలకు వెళ్లే విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వటం లేదని తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీ పాలక మండలి చేసిన తీర్మానాలను వెంటనే అమలు చేయాలని, యూనివర్సిటీ లో నూతన గర్ల్స్ హాస్టల్ వెంటనే నిర్మించాలని , నూతన కోర్సులను ప్రవేశ పెట్టాలని, యూనివర్సిటీ అభివద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల ఉద్యమానికి మద్దతు తెలుపుతున్నామని, యూనివర్సిటీ లో పూర్తి స్థాయిలో పీజీ సీట్లు భర్తీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, జయంతి, గౌని ప్రసాద్, అక్షయ్, శివసాయి, ఆకాష్, రాజ్ కుమార్, అశ్విత్, తదితరులు పాల్గొన్నారు.

ఇంకా 20 బిసి కులాలకు లక్ష సహాయం ఇవ్వాలి

బీసీ సంక్షేమ సంఘం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కేర్ డిగ్రీ కళాశాలలో బీసీ సంక్షేమ సంఘం సర్వ సభ్య సమావేశం జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. సమావేశంలో పలు బీసీ సమస్యలపై చర్చించారు. ప్రభుత్వం చేతి వృత్తుల వారికి ఇస్తున్న లక్ష సహాయం పట్ల హర్షం వ్యక్తం చేసారు. ఈ ఆర్థిక సహాయం కేవలం 15 కులాలకు మాత్రమే కాకుండ ఇంకా వెనకబడిన కులాలు దాదాపు 20 కులాలు ఉన్నందున వారికి కూడా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. నిజామాబాద్ నగరంలో బీసీ భవనం కోసం స్థలం కేటాయించాలని అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బుస్స ఆంజనేయులు, నగర అధ్యక్షులు దర్శనం దేవేందర్ మాట్లాడారు. కార్యక్రమంలో కొయ్యాడ శంకర్, లక్ష్మణ్ గౌడ్, పూల్గం మోహన్, మధుసూదన్, కరిపే రవిందర్, సంజీవ్, రమణ స్వామి,బాలన్న అనిల్, గోపి, గంగాధర్, లక్ష్మీనారాయణ, నరేష్, సాయిలు, బసవ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని మతాలకు ఒకే పౌరస్మృతి ఉండాలి



నిజామాబాద్‌సి : నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జన సంఘ పార్టీ మొదటి వ్యవస్థాపక అధ్యక్షులు దేశం మొత్తంలో అన్ని మతాలకు ఒకే విధమైన పౌర స్మృతి ఉండాలని ఉద్ఘాటించారని బిజెపి జిల్లా అధ్యక్షులు బస్వా లక్ష్మీ నర్సయ్య అన్నారు. డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా బిజెపి పార్టీ జిల్లా కార్యాలయంలో ఇతర జిల్లా నాయకులు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ధన్ పాల్ సూర్యనారాయణ, న్యాలం రాజు, పోతన్ కర్ లక్ష్మి నారాయణ, స్రవంతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ :బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ 122వ జయంతిని పురస్కరించుకొని అంబేద్కర్ చౌరస్తా వద్ద గురువారం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జెస్సు అనిల్ కుమార్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు నూతుల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు విజయానంద్, పట్టణ ఉపాధ్యక్షులు మీసాల రాజేశ్వర్, పాన్ శీను, భవాని నవీన్, పట్టణ కార్యదర్శులు ఖాందేశ్ ప్రశాంత్, పులి యుగంధర్, గుగులోత్ తిరుపతి నాయక్, గిరిజన మోర్చ పట్టణ అధ్యక్షులు కేలోత్ పీర్ సింగ్, కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షులు శేషగిరి లింగం తదితరులు పాల్గొన్నారు.

కేజ్ వీల్ ట్రాక్టర్ సీజ్

నవతెలంగాణ-వేల్పూర్

మండలంలోని అంక్సాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి కేజ్ వీల్ ట్రాక్టర్ ను ఎటువంటి పట్టీలు లేకుండా బిటీ రోడ్డుపై నడపడంతో గురువారం ఎస్ఐ వినయ్ సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. నిబంధనలకు విరుద్ధంగా కేజీలు ట్రాక్టర్లు నడిపితే కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఎక్కడైనా కేజ్ వీల్ ట్రాక్టర్ డైరెక్ట్‌గా నడిపినట్టు కనబడితే 8712659862 నెంబర్ కి కాల్ చేసి తెలపాలని, తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

డిటిఓను కలిసిన డిప్యూటీ మేనేజర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలోని నాగారం ప్రాంతంలో గల రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ కార్యాలయంలో జిల్లా డిప్యూటీ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఆఫీసర్ డాక్టర్ కె. వెంకటరమణ ను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిజామాబాద్ రీజియన్ డిప్యూటీ మేనేజర్ సరస్వతి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీపీఐ(ఎం) నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు
- జీపీ కార్మికుల సమ్మె ప్రారంభం

నవతెలంగాణ-విలేకరులు

నిజామాబాద్:రాష్ట్రవ్యాప్త గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెలో భాగంగా నిజామాబాద్‌జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలో పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించి తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈసందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులతో ప్రభుత్వాలు వెట్టి చాకిరి చేయించుకుంటున్నాయని అన్నారు. కేవలం 8500 ఇస్తూ మల్టీపర్పస్ విధానాన్ని అమలు జరుపుతున్నారని, దీని మూలంగా కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుతూ విద్యుత్, తాగునీటి సౌకర్యం ప్రజలకు అందిస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు కానీ వారికి కనీస వేతనాలు జీవో నెంబర్ 60 ప్రకారం పరిశుద్ధ కార్మికులకు 15600 అదేవిధంగా కారోబార్లకు బిల్ కలెక్టర్లకు 25 వేల రూపాయలు చెల్లించాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి పర్మినెంట్ చేయాలని ప్రభుత్వమే నిధులను కేటాయించి కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చర్చలు జరిపి సమస్యను పరిష్కరించకుంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు శంకర్, నాగయ్య, సాయికుమార్ సావిత్రి గంగరాజు, సుభాష్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : గ్రామపంచాయతీ ఉద్యోగులు, కార్మికుల వేతనం పెంచి పర్మినెంట్ చేయాలని రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా మండల కేంద్రంలో సమ్మె శిబిరాన్ని రాష్ట్ర జేఏసీ కన్వీనర్ దాసు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవో నెంబర్ 60 ప్రకారం సఫాయి కార్మికులకు 15,600, కారోబార్, బిల్ కలెక్టర్, ట్రాక్టర్ డ్రైవర్లకు 19,600 వేతనం పెంచి, పిఎఫ్ ఈఎస్ఐ చట్టాలను వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా ఐఎఫ్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు భూమన్న, శివకుమార్ పాల్గొని ప్రసంగిస్తూ పంచాయతీ కార్మికులకు ప్రమాద బీమా 10 లక్షలు, సాధారణ మరణానికి ఐదు లక్షలు, బట్టలు, చెప్పులు, ఆయిల్, సబ్బులు, పరికరాలు ఇవ్వాలని అన్నారు. నరేంద్ర మోడీ తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను తెలంగాణలో అమలు చేయడం సాధ్యం కాదని అసెంబ్లీ తీర్మానం చేయాలని కార్మికులకు అండగా నిలవాలని ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరారు. తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు భానుచందర్, మండల అధ్యక్షులు సొప్పరి గంగాధర్, సహాయ కార్యదర్శి గోపి, టిజికేఎస్‌యూ నాయకులు సవీన్, సంతోష్ ఐఎఫ్‌టీయూ నాయకులు బండి సాయన్న, గోవర్ధన్, శ్రీనివాస్ రెడ్డి, శేఖర్, మల్లయ్య, రాజన్న, మంఖ్య, సర్వర్ లక్ష్మి, గున్నా వా, బుచ్చ క్క, రాజగంగు, భ్వా దేవి, తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో..



రుద్రూర్‌లో..



సిరికొండలో..

పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలి

ఆర్మూర్: గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలని, రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు సమ్మెకు పునుకోవడం జరిగిందని ఐ ఎఫ్ టి యు రాష్ట్ర సహాయ కార్యదర్శి సూర్య శివాజీ, సిఐటియు మండల అధ్యక్షులు కుతాడి ఎల్లయ్య తెలిపారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కెసిఆర్ ప్రభుత్వం సఫాయి కార్మికుల జీవితాలను అర్థం చేసుకొని వెంటనే చర్చలు జరిపి సమ్మె నివారణ కృషి చేయాలని వారు కోరారు. రాష్ట్రంలో ఉన్న 50వ వేల మంది ఉద్యోగ కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐ చట్టాలను వెంటనే వర్తింపజేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి పద్మారావు, బి గంగాసాయన్న, టి సాయన్న, ఎస్ గంగు, ఈ బాలవ్వ , ఎం గంగమణి, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట్: గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేసే వరకు సమ్మెను కొనసాగిస్తామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాయక్ వాడి శ్రీనివాస్ అన్నారు.మండల కేంద్రంలో అమర వీరుల స్థూపానికి నివాళులర్పించి గురువారం సమ్మెను ప్రారంభించారు. కార్యక్రమంలో మేకల ఆంజనేయులు, లక్ష్మయ్య, రాములు, పోశెట్టి, భూషణ్, దేవకి, లలితా మరియు కార్మికులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

మోర్తాడ్: గ్రామపంచాయతీ సిబ్బంది అందరిని పర్మినెంట్ చేయాలని పంచాయతీ కార్మికుల జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రాన్ని గురువారం అందజేశారు. ప్రమాదంలో మరణించిన కార్మిక కుటుంబాలకు 10 లక్షల రూపాయలు నష్టపరిహారంతో పాటు పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించకపోవడం సరికాదని ప్రజాపంథా జిల్లా నాయకుడు కిషన్ అన్నారు. కార్యక్రమంలో మండలంలో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

సిరికొండ: ప్రత్యేక బడ్జెట్ కేటాయించి గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వాలని, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతి ఉద్యోగ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మెకు సిపిఐ ఎంఎల్ ప్రజాపందా సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని, పార్టీ రాష్ట్ర కమిటీ నాయకులు పి రామ---కష్ణ అన్నారు. సిరికొండ మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ముందు సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామపంచాయతీలలో 50 వేల మంది పంచాయతీ సిబ్బంది పని చేస్తున్నారని, 2011 జనాభా ప్రాతిపదికన 500 మందికి ఒక కార్మికులు నియమించారని తెలిపారు. ప్రజల అవసరాలు కనుగుణంగా కొత్త కార్మికులను నియమించకుండా ఉన్నవారితో వెట్టి చేయిస్తున్నారని అన్నారు. అనంతరం ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్ రమేష్ మాట్లాడారు. పార్టీ నాయకులు ఎం సాయా రెడ్డి మల్కి లింబయ్య బోధాస్ కిషోర్, ఎండి అనీష్, అఫ్రోజ్, కట్ట రాములు,పండరి, గ్రామపంచాయతీ సంఘం నాయకులు శ్రీనివాస్, కుమ్మరి రాజన్న, సలీం, గంగయ్య, బొర్రవ్వ తదితరులు పాల్గొన్నారు



జక్రాన్‌పల్లిలో..



నవీపేట్‌లో..

అడిగేవరకూ కౌన్సిల్ సమావేశం నిర్వహించరా?

- తక్షణమే సమావేశం ఏర్పాటు చేయండి
- మున్సిపల్ కమిషనర్‌ను కోరిన బిజెపి కార్పొరేటర్లు

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

నూతన మున్సిపల్ చట్టం ప్రకారం ప్రతి మూడు నెలలకు ఒకసారి కౌన్సిల్ సమావేశం నిర్వహించవలసినప్పటికీ, కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయకపోవడం దారుణమని భారతీయ జనతా పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ కార్పొరేటర్లతో కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ , ఇంచార్జ్ కమిషనర్ చిత్రా మిశ్రాని కలిసి కౌన్సిల్ సమావేశాన్ని తక్షణమే నిర్వహించాలని లేఖ ద్వారా తెలియజేశారు. కౌన్సిల్ సమావేశాలు మూడు నెలలకోసారి నిర్వహించాలని కోరుతున్నప్పటికీ, ఏడాదికోసారి కౌన్సిల్ సమావేశాన్ని తూతూ మంత్రంగా నిర్వహించడం అన్యాయమన్నారు. 15 రోజుల్లో కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించాలని ఆమె కోరగా, కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరితగతిన కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. నగరంలో అన్ని డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీల సమస్యలు, వీధి దీపాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారుల మీద ఉందని తెలిపారు. డివిజన్‌కు 10 లక్షల చొప్పున నిధులు కేటాయిస్తానన్న హామీ అలాగే ఉండిపోయిందని, పనులు వెంటనే పూర్తి చేసి నిధులు విడుదల చేయాలని అన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ న్యాలం రాజు, రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్లు పంచరెడ్డి ప్రవళిక, మెట్టు విజయ్, బంటు వైష్ణవి రామ్, మమతా ప్రభాకర్, బూరుగుల ఇందిర వినోద్, ఇప్పకాయల సుమిత్రా కిషోర్ తదితరులు పాల్గొన్నారు

ముస్లిం శ్మశాన వాటికలో మురుగు నీరు

- తక్షణమే డ్రైనేజీ పనులను ప్రారంభించాలి
- ఎంపిపి రమేష్ నాయక్, టోల్ ప్లాజా అధికారుల పరిశీలన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండల కేంద్రంలోని ముస్లిం శ్మశాన వాటిక వరకే రాహదరి విస్తరణ చేసినప్పుడు డ్రైనేజీ ని వదిలి వేయడంతో ముస్లిం సోదరులు ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఎంపీప బాదవత్ రమేష్ నాయక్ దృష్టికి, టోల్ ప్లాజా అధికారుల కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని గతంలో అందజేశారు. దానిలో భాగంగానే గురువారం ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, ఎంపిటిసి చింతల దాస్, హైవే మేనేజర్ గౌరీ నాయుడు, కో-ఆప్షన్ సభ్యులు షేక్ హుస్సేన్, ముస్లిం మండల కమిటీ అధ్యక్షులు హబీబ్, మస్ జీద్ కమిటీ అధ్యక్షులు ఖాజామియ్య ముస్లిం కమిటీ ప్రతినిధులు స్మశాన వాటిక పరిశీలించారు. ఈ సందర్భంగా ముస్లిం కమిటీ సభ్యులు మాట్లాడుతూ రహదారి 44 విస్తరణ సమయంలో సర్వీస్ రోడ్డు పక్కన డ్రైనేజీ నిర్మాణం చేపట్టి శ్మశాన వాటిక వద్దనే వదిలి వేయడంతో మురికి నీరు ఒక్క చోట చేరి సమాధుల్లో చేరుతుందని వివరించారు.ఈ సమస్యలను పరిష్కరించాలని గతంలో నేషనల్ హైవే ప్రాజెక్టు మేనేజర్ నిర్మల్‌కు వినతి పత్రాన్ని పలుమార్లు అందజేసిన పట్టించుకోలేదని వారన్నారు. ఇదే విషయమై ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ దృష్టికి తీసుకొని వచ్చిన వెంటనే టోల్ ప్లాజా అధికారులకు డ్రైనేజీ నిర్మాణం త్వరగా చేపట్టేలా చూడాలని ఆదేశించినట్లు ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్ మాట్లాడుతూ తక్షణమే శుభ్రం చేసి పనులు ప్రారంభించి మురుగునీరు పక్కన కాలువలో వదిలేయాలని హైవే మేనేజర్ గౌరీ నాయుడుకి మర్యాదపూర్వకంగా విన్నవించారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్టు మేనేజర్ నిర్మల్‌కు సమాచారాన్ని అందించి పనులను ఎక్కడి నుండి ఎక్కడి వరకు చేయాలో హైవే మేనేజర్‌కు చూపించామని ఎంపీపీ వివరించారు. సర్వీస్ రోడ్డు కి ఇరువైపుల డ్రైనేజీలో కూరుకు పోయిన చెత్తాచెదారం తొలగించే విధంగా చూడాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు షేక్ కరీం, మైనారిటీ యూత్ అధ్యక్షులు షేక్ మోసిన్, టోల్ ప్లాజా అధికారులు ఉన్నారు.



పరిశీలిస్తున్న ఎంపీపీ, టోల్ ప్లాజా అధికారులు

శంకర్ భవన్ పాఠశాల గ్రౌండ్‌లో మొరం వెయ్యాలి

- ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

వర్షం నీరు నిలిచిన శంకర్ భవన్ ప్రభుత్వ పాఠశాల గ్రౌండ్ మారిందని. తగినంత మొరాన్ని వేయించే విధంగా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ నగర కమిటీ అధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల సందర్శనలో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోగల శంకర్ భవన్ స్కూల్ నందు వర్షం నీరు నిలువ ఉండకుండా మొరం వెయ్యాలని పాఠశాల గ్రౌండ్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నగర ఉపాధ్యక్షులు గణేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు సమస్యలకు నిలయంగా మారుతున్నాయని అన్నారు. ఒక్క పూట కురిసిన వర్షానికే శంకర్ భవన్ స్కూల్ గ్రౌండ్ చెరువుకు తక్కువ కొలనుకు ఎక్కువ అన్నట్టు నిండిపోయి ఉండటం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో పరిస్థితి మరింత అధ్వానంగా తయారు అవుతుందన్నారు. విద్యాశాఖ, మున్సిపల్ అధికారులు స్పందించి స్కూల్ అవరణలో నీరు నిలువ ఉండకుండా మట్టి వేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర నాయకులు విశాల్, రాహుల్, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాలగ్రౌండ్‌లో నిరసన తెలుపుతూ..

మొబైల్ ఫోన్ సెట్ అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

జియో భారత్ ప్రతమ్ ఫోన్ జియో వారి అధ్వర్యంలో గురువారం పట్టణంలోని రాజారాంనగర్ కి చెందిన నిరుపేద గృహిణి జనార్ధన్ ప్రమీలకు ఉచితంగా మొబైల్ ఫోన్ సెట్ అందజేశారు . ముఖ్య అతిథిగా విచ్చేసిన లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ నివేదన్ గుజరాతి అందజేశారని సిఎస్ సందీప్ తెలిపారు. కార్యక్రమంలో పిట్ల శ్రీధర్, బెల్దారి శ్రీనివాస్, నరేష్, బాలు, తదితరులు పాల్గొన్నారు.